

# ముదిమి వయస్సులో అమ్మ

కృష్ణా! రామా !! అంటూ హాయిగా మనవళ్లతో, మనవరాళ్లతో కాలక్షేపం చేయవలసిన వయస్సు అది. ఏమాత్రం చిన్న ఒత్తిడిని కానీ, పనిభారాన్ని కానీ తట్టుకోలేని వయస్సు. జీవితంలో ముప్పాతిక భాగం గడిచిన తరువాత ఇప్పుడు ఒడిలో ఇద్దరు పసిబిడ్డలకి లాలిపాట పాడుతోంది 70 సంవత్సరాల ఓంకారి పన్వర్. ముదిమి వయస్సులో అమ్మ అయిన స్త్రీగా రికార్డుల్లోకి ఎక్కినా దాని గురించి ఏమాత్రం తెలియదంటోంది. ఇప్పుడు తాను ఎందుకు అమ్మ కావాలనుకుందో ఆమె మాటల్లోనే....

బ్రిటీష్ వారు మన దేశాన్ని వదిలి వెళ్లే నాటికి ఓంకారి వయస్సు తొమ్మిది సంవత్సరాలు. చిన్న వయస్సులోనే చరణ్ సింగ్ పన్వర్‌తో వివాహం జరిగింది. ఇద్దరు ఆడపిల్లలు కలిగారు. వారికి ఐదుగురు సంతానం. అంటే నాకు ఐదుగురు మనవలు, మనవరాళ్లు. అయితే ఒకటే కొరతగా ఉండేది. కొడుకు లేడని నేనూ, నా భర్త బాధపడేవాళ్లం. చివరికి ఐవిఎఫ్ ట్రీట్‌మెంట్ ద్వారా కొడుకుని కనాలని నిర్ణయించుకున్నాం. మొదట మా పిల్లలు దీనికి అంగీకరించలేదు. వారి నిర్ణయాలతో పనిలేకుండా ఐవిఎఫ్ ట్రీట్‌మెంట్‌కి వెళ్లాం. నెలలు నిండాయి. నేను స్పృహలో లేనప్పుడు వైద్యం కోసం నా పిల్లలు నన్ను కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారట! నాకు తెలియదు. రాబోయే టైటిల్ గురించి నాకు ఏమీ తెలియదు. పుట్టిన ఇద్దరు పిల్లల్ని పెంచి పెద్ద చేయడమే ఇప్పుడు నా ముందున్న లక్ష్యం'' అని చెప్పింది ఓంకారి.

ఈ సందర్భంగా చరణ్ సింగ్ పన్వర్ మాట్లాడుతూ, ''ట్రీట్‌మెంట్ కోసం నాకున్న ఎద్దుల్ని అమ్మేశాను. చివరి రోజులలో ఉపయోగపడుతుందని దాచుకున్న డబ్బుని ఖర్చు పెట్టేశాను. చివరకి క్రెడిట్ కార్డు మీద అప్పు కూడా తీసుకున్నాం. ఓంకారి కడుపుతో ఉన్నప్పుడు మా కోరిక నెరవేరాలని సాధువుల చుట్టూ తిరిగే వాళ్లం. గుళ్లు గోపురాలకి వెళ్లి మా కోరిక నెరవేర్చమని ఆ దేవుడిని ప్రార్థించే వాళ్లం. చివరికి ఆ దేవుడు మా మొర ఆలకించాడు. ఒక కొడుకు, ఒక కూతురిని ప్రసాదించాడు. ఇప్పుడు నేను గర్వంగా చనిపోతాను.''

### షాక్ తిన్నాను...

ఈ సందర్భంగా డాక్టర్ నిషా మాలిక్ మాట్లాడుతూ, ''మొదట ఓంకారిని చూసి గర్భిణి అని అనుకోలేదు. ఆ తరువాత సంగతి తెలిసి షాక్ తిన్నాను. నా దగ్గరకి తీసుకొచ్చే సమయానికి ఆమెకు చాలా రక్తస్రావం జరిగింది. అదంతా సరిచేసి చివరికి సిజేరియన్ చేసి ప్రసవం చేశాం''.

## 'సరసి'కత

వైశంపాయనుడికి పెళ్లిలో వచ్చిన అన్ని గిఫ్టుల్లోకి అతడి మనసు దోచిన బహుమతి ఒకటుంది. అది మూడు గిన్నెల అన్నం క్యారియర్!

దాన్ని చూస్తే మామూలు క్యారియర్‌గా అనిపించదు. వెరైటీ డిజైన్‌తో డిఫరెంట్‌గా కనిపిస్తుంది. చూసిన వాళ్లందరూ ''అరే బావుందే, ఇలాంటిదెక్కడ దొరుకుతుందీ?'' అని ప్రశ్నించడం, ''ఇక్కడెక్కడా దొరకదు, మా పెద నాన్నగారు యాత్రల కెళ్లినప్పుడు ఎక్కడో కొని తెచ్చి, నాకు గిఫ్టిచ్చారు'' అని వైశంపాయనుడు గర్వంగా చెప్పడం తరచూ జరిగేది.



# మూడు గిన్నెల కేరియర్

ఒరోజు దాన్ని తోమడం కోసం, పెరటి వైపు గిన్నెలు తోమే చోట పడేసింది అతడి భార్య సుబ్బాయమ్మ గారు. ఆరోజు పనిమనిషి రాలేదు. రాత్రి లోపల పెట్టుకోవడం మరిచిపోయిందామె. ఉదయం లేచి చూసే సరికి క్యారియర్ కనిపించలేదు.

చోరీ అయిందని తెలియగానే వైశంపాయనుడు అగ్గి మీద గుగ్గిలం అయిపోయాడు. భార్య అశ్రద్ధకు ఆమెను తిట్టని తిట్టు లేదు.

తర్వాత, కోపం నుంచి కోలుకుని, పోలీసు స్టేషన్‌కు వెళ్లాడు కంప్లయింట్ ఇవ్వడానికి. అతడు వెళ్లే సరికి ఇన్‌స్పెక్టర్ కుర్చీలో కూర్చుని ఫోనులో ఎవరితోనో మాట్లాడుతున్నాడు. అయ్యేక చెబుదామని కొద్ది సేపు అలాగే నిలబడ్డాడు వైశంపాయనుడు.

ఇంతలో ఓ కానిస్టేబుల్ ఇంటి నుంచి ఇన్‌స్పెక్టరకు భోజనం తెచ్చి టేబుల్ మీద పెట్టాడు. వైశంపాయనుడు ఒక్కసారి గతుక్కుమన్నాడు. ఆ భోజనం తెచ్చిన క్యారియర్ తనదే!